www.aakshitha.com
People's voice
అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY
తెలంగాణ దిక్సూచి
సోమవారం । 11 । మే । 2026



# రూ.954 కోట్ల ధాన్యం కొనుగోలు

**- కలెక్టర్ చంద్ర శేఖర్**



**నల్గొండ, అక్షిత ప్రతినిధి:** రబీ ధాన్యం కొనుగోలులో భాగంగా జిల్లాలో ఇప్పటి వరకు 954.63 కోట్ల రూపాయల విలువ చేసే 3 లక్షల 99,593 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు 6 లక్షల 59 వేల 596 మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చినట్లు ఆయన వెల్లడించారు. కొనుగోలు చేసిన ధాన్యంలో 3 లక్షల 97,616 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు రవాణా చేసినట్లు పేర్కొన్నారు. 644 కోట్ల రూపాయల విలువచేసే 2 లక్షల 69 వేల 730 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ట్యాబ్ ఎంట్రీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ధాన్యం అమ్మిన రైతులకు చెల్లింపులలో భాగంగా 30 వేల 167 మంది రైతులకు 558.94 కోట్ల రూపాయలను చెల్లించినట్లు కలెక్టర్ వివరించారు.

రబీ ధాన్యం కొనుగోలుపై ప్రతిరోజు క్షేత్రస్థాయిలో కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, మిల్లర్లు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్షిస్తున్నామని, అంతేకాక సమీక్ష సమావేశాలు, టెలికాన్ఫరెన్స్, వీడియో కాన్ఫరెన్స్ లు నిర్వహిస్తున్నామని, ధాన్యం రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నామని, అలాగే కొనుగోలు కేంద్రాలలో జాప్యం జరగకుండా అన్ని రకాల చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఎప్పటికప్పుడు లారీలు, హమాలీ, ధాన్యాన్ని తరలించడం వంటి వాటిపై ప్రత్యేక దృష్టికి కేంద్రీకరించినట్లు కలెక్టర్ వెల్లడించారు.

- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న సంబంధిత శాఖ అధికారులు
- చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్

# మట్టి మాఫియా ఆగడాలు



**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** సత్తుపల్లి పట్టణ పరిధిలోని వేశ్యకాంతల చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. వందలాది ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తూ కొందరు అక్రమంగా భారీగా సొమ్ము చేసుకుంటున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ అక్రమ తవ్వకాలపై ప్రశ్నించిన వారిపై మట్టి మాఫియా భౌతిక దాడులకు కూడా వెనుకాడటం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంతజరుగుతున్నప్పటికీ మిగతా 2లో..

# రూ.225 కోట్లతో బాసర ఆలయ ప్రగతి

- పకడ్బందీగా మాస్టర్ ప్లాన్ అమలు
- భక్తులకు అత్యాధునిక సౌకర్యాలు కల్పిస్తాం
- దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు



**నిర్మల్, అక్షిత బ్యూరో:** తెలంగాణలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ అభివృద్ధికి రూపొందించిన మాస్టర్ ప్లాన్‌ను పకడ్బందీగా అమలు చేస్తామని దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు తెలిపారు. ఆదివారం నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాతో కలిసి బాసర ఆలయ పరిసర ప్రాంతాలను మిగతా 2లో..





# ఆలయాలకు రాజకీయ రంగొద్దు

- బిఆర్ఎస్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి రెడ్డి
- దేవుళ్ళపై రాజకీయం చేస్తే పుట్టగతులు ఉండవు
- వెంకటేశ్వర ఆలయం నిర్మాణానికి 23 నెలలు
- ఉడికిన ఆహారం తినలే
- భగవంతుడి సాక్షిగా గుడి
- పైసలు ఒక్క రూపాయి కూడా తాము ముట్టలేదు

**అక్షిత ప్రతినిధి, భూపాలపల్లి:** కాంగ్రెస్ నాయకుడు అనిల్‌నే శాశ్వత ధర్మకర్తగా పెట్టాము. అనైతికంగా ఆలయ కమిటీని వేశారు. భూపాలపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ వరంగల్ జిల్లా జడ్పీ చైర్పర్సన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి రెడ్డి ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. భూపాలపల్లి జిల్లాగా ఏర్పడి దినదినాభివృద్ధి చెందుతున్న క్రమంలో 2022 లో అప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న గండ్ర వెంకటరమణ రెడ్డి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించాలని సంకల్పించారు. తిరుపతిలో కలియుగ దైవాన్ని విఐపిగా దర్శించుకునే వారికే కనీసం రెండు నిమిషాలు కూడా ఆ స్వామిని చూడలేని పరిస్థితి.. వాటన్నిటిని దృష్టిలో పెట్టుకొని ఇక్కడి ప్రాంత ప్రజలకు, మిగతా 2లో..





# రూ.225 కోట్లతో బాసర ఆలయ ప్రగతి

(మొదటి పేజీ తరువాయి)

ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా అధికారులు శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణం, మహాలక్ష్మి అమ్మవారి ఆలయం, వ్యాసగుహతో పాటు పలు ప్రాంతాలను సందర్శించి మాస్టర్ ప్లాన్ అమలుపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు మాట్లాడుతూ బాసర ఆలయ అభివృద్ధికి రూ.225 కోట్లతో సమగ్ర ప్రణాళిక రూపొందించామని తెలిపారు. మాస్టర్ ప్లాన్ అమలుతో బాసర క్షేత్ర రూపురేఖలు పూర్తిగా మారనున్నాయని, ఇది రాష్ట్రంలోనే ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అవతరించనున్నదని పేర్కొన్నారు. ఆగమ శాస్త్ర నియమాలకు అనుగుణంగా, భక్తుల విశ్వాసాలను పరిరక్షిస్తూ అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు. దేశ నలుమూలల నుంచి వచ్చే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఇటీవల బాసర ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. మాస్టర్ ప్లాన్ ద్వారా ఆలయం మరింత అభివృద్ధి చెందుతుందని, భక్తులకు సకల సౌకర్యాలతో కూడిన వసతులు కల్పించేలా నిర్మాణ పనులను నిరంతరం పర్యవేక్షిస్తామని తెలిపారు. రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేపడతామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఏఎస్పీ సాయికిరణ్, ఆలయ ఈవో అంజనా దేవి, తహసీల్దార్ పవన్ చంద్రతో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మట్టి మాఫియా ఆగడాలు

(మొదటి పేజీ తరువాయి)

ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల మౌనానికి కారణమేమిటన్నది ప్రస్తుతం స్థానికంగా బహిరంగ చర్చకు దారితీసింది.చెరువు పరిరక్షణతో పాటు అక్రమ మట్టి తవ్వకాలకు పాల్పడుతున్న వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని, సంబంధిత శాఖ అధికారులు స్పందించి పరిస్థితిని అదుపులోకి తీసుకురావాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# తాలు పేరుతో ఎలాంటి కోతలు విధించొద్దు

**అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి**

**రైస్ మిల్లర్లు ధాన్యం స్వీకరణలో సహకరించాలి**

**కొనుగోళ్ల వేగం పెంచేందుకు హమాలీల సంఖ్యను పెంచాలి**

**నాణ్యతపై సందేహాలుంటే ముందుగా డీఎస్‌వోకు సమాచారం ఇవ్వాలి**




**ఖమ్మం/అక్షిత బ్యూరో:**

రైస్ మిల్లుల వద్ద ధాన్యం దిగుబడి చేసుకునే సమయంలో తాలు పేరుతో ఎలాంటి కోతలు విధించొద్దని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోళ్లపై జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు రైస్ మిల్లర్లు మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి సమీక్షించారు.

అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తాలు పేరుతో రైస్ మిల్లర్లు ఎలాంటి కోతలు విధించరాదని స్పష్టం చేశారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని నిర్దిష్ట కారణాలు లేకుండా తిరస్కరించ వద్దని సూచించారు.

ఏదైనా ధాన్యం ఎఫ్.ఏ.క్యూ. నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా లేదని భావించిన పక్షంలో వెంటనే జిల్లా పౌర సరఫరాల అధికారికి (డీఎస్‌వో) సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. సమాచారం అందిన వెంటనే వ్యవసాయ శాఖ అధికారులతో కూడిన సాంకేతిక సహాయ కమిటీని రైస్ మిల్లులకు పంపించి ధాన్యం నాణ్యతను పరిశీలిస్తామని తెలిపారు.

సాంకేతిక కమిటీ నివేదికలో నాణ్యత ప్రమాణాలు లేవని నిర్ధారణ అయిన పక్షంలో మాత్రమే ధాన్యాన్ని తిరస్కరిస్తామని స్పష్టం చేశారు. రైస్ మిల్లర్లు అందరూ ధాన్యం స్వీకరణలో సహకరించాలని సూచించారు.ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం కావాలంటే హమాలీల సంఖ్యను పెంచాలని ఆదేశించారు. రైతులు ధాన్యం విక్రయంలో ఇబ్బందులు పడకుండా ప్రతి రైస్ మిల్లర్ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు బొమ్మ రాజేశ్వర్ రావు మిల్లర్లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆలయాలకు రాజకీయ రంగొద్దు

(మొదటి పేజీ తరువాయి)

తిరుపతికి వెళ్ళలేని వారికి ఆ కలియుగ దైవాన్ని దర్శించుకునేందుకు వీలుగా పట్టణమంతా మంజూర్ నగర్ లోనే విస్తరిస్తున్న క్రమంలో భూపాలపల్లి పట్టణంలోని మంజూర్ నగర్ లో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం చేపట్టడం జరిగిందనీ తెలిపారు.

ఒక్కరితోనే నిర్మాణం కాకుండా ఆలయ నిర్మాణం లో అందరూ భాగస్వాములు కావాలని అందరి సహాయ సహకారాలు కోరడం జరిగిందన్నారు..ఎటువంటి ఆటంకాలు లేకుండా ఆలయ నిర్మాణం పూర్తి చేయాలని 23 నెలలు అకుంఠిత దీక్ష తోనీ ఆహారం కూడా ముట్టలేదనీ తెలిపారు..14 నెలల్లోనే గుడి నిర్మాణ0 పూర్తి చేసి స్వామి వారిని ప్రతిష్టించుకోవడం జరిగిందని పేర్కొన్నారు. స్వామి వారి ఆలయ నిర్మాణం పూర్తయిన తరువాత మొక్కులో భాగంగా సంకల్పం తో అందరూ బాగుండాలని భూపాలపల్లి నుండి తిరుపతికి పాదయాత్ర చేశాను. అదృష్టం బాగా లేక తాము ఓటమి చెందామని...గెలిచిన వారు ఆలయం పై రాజకీయాలు చేయడం మొదలు పెట్టారని విమర్శించారు..ఆలయానికి సంబంధించి హైకోర్ట్ తీర్పు కూడా తమకే అనుకూలంగా వచ్చినప్పటికీ ఎందుకు కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారో తెలియదని.?

కేసులతో ,అరెస్టలతో

ఇంత అరాచకం ఎందుకు సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు..శాశ్వత ధర్మ కర్తగా నియమించిన అనిల్ కూడా ఇప్పుడు వాళ్ళ దగ్గరే ఉన్నారని...భక్తుల విరాళాలు ఒక్క రూపాయి కూడా ముట్టలేదన్నారు.

అనైతికంగా ఏర్పాటు చేసిన కమిటీకి నిరసన తెలుపడానికి ఆలయానికి వస్తే..ఒక మహిళా నాయకురాలు అని కూడా చూడకుండా ఒక తీవ్ర వాది లాగా ఎలా బలవంతంగా అరెస్ట్ చేసి తీసుకెళ్లారో ప్రజలందరూ చూసారనీ ఆవేదన వ్యక్తం చేశారు..అధికారం చేతిలో ఉందని ఇష్టా రీతిన వ్యవహరిస్తున్నారని,పెత్తనం కాదు స్వామికి నేను సేవకురాలిని మాత్రమే అని గండ్ర జ్యోతి అన్నారు..దేవుని సాక్షిగా జరిగిన ఈ ఘటనకు దైవమే సమాధానం చెప్తుందన్నారు..ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పట్టణనాయకులు, వెంకటేశ్వరస్వామి భక్తులు , బీఆర్ఎస్ యూత్ నాయకులు మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు..

### మే 11 నుంచి 17 వరకు
# విద్యా వారోత్సవాలు



**మహబూబ్ నగర్, అక్షిత ప్రతినిధి:** స్థానిక ప్రభుత్వ ఎన్టీఆర్ మహిళా డిగ్రీ అటానమస్ కళాశాలలో మే 11 నుంచి 17 వరకు విద్యావారోత్సవాలు నిర్వహించనున్నట్లు కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ అమీన ముంతాజ్ జహాన్ తెలిపారు.

ప్రజాపాలన – ప్రగతిప్రణాళికలో భాగంగా వారం రోజుల పాటు మొదటి రోజు (మే 11) కళాశాల స్థాయి మౌళిక సదుపాయాల శంకుస్థాపన, రెండవరోజు (మే 12) జిల్లాస్థాయి విద్యార్థుల విద్యా సహాయం, శ్రేయస్సు కార్యక్రమాలు, మూడవ రోజు (మే 13) నియోజక వర్గస్థాయి విద్యా సహాయ సదస్సు, నాల్గవరోజు (మే 14) కళాశాల స్థాయి మెగా పేరెంట్ టీచర్ మిటింగ్, ఐదవరోజు (మే 15) కళాశాల స్థాయి మన గ్రంథాలయ జ్ఞానోత్సవం, ఆరవరోజు (మే 16) జిల్లా స్థాయి ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ పై అవగాహన, ఆవిష్కరణ, ఏడవరోజు (మే 17) జిల్లా స్థాయి ఇన్స్టిట్యూషనల్ ఎక్సలెన్స్, రికగ్నిషన్, వంటి విభిన్న కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. విద్యార్థినిలు, తల్లి దండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## బహిరంగ సభకు వెళ్లే బస్సును బీజేపీ జెండా ఊపి ప్రారంభించిన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రారెడ్డి

**గద్వాల, అక్షిత న్యూస్:** జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మునిసిపల్ లో ప్రధాని నరేంద్ర మోడీజీ భారీ బహిరంగ సభకు వెళ్లే బస్సు ను





జెండా ఊపి ప్రారంభం చేసి అనంతరం వారు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ పరేడ్ గ్రౌండ్స్ జరిగే భారీ బహిరంగ సభకు జిల్లా నుండి ప్రత్యేక రైలు, బస్సులు ప్రైవేట్ వాహనాల ద్వారా వేలాదిగా స్వచ్ఛందంగా యువత, రైతులు మరియు మహిళలు వెళుతున్నరు అని రాబోయే ఎన్నికలలో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ గెలుపు తథ్యం అని వారు అన్నారు ఈ కార్యక్రమం పట్టణం అధ్యక్షులు తెలుగు నర్సింహా, మాజీ అధ్యక్షులు కంపాటి భగత్ రెడ్డి,రాజశేఖర్, చాకలి నర్సింహా, ప్రతీప్, తూముకుంట అంజి, లక్ష్మణ్ ఆచారి, తదితరులు పాలుగోన్నారు.




# ఉద్యోగం చిన్నదైన సరే అనుభవం సంపాదించడం ముఖ్యం

### ప్రతి యువకుడు తన నైపుణ్యం నిరంతరం పెంపొందించాలి
### జాబ్ మేళాకు విశేష స్పందన

**యాదాద్రి భువనగిరి/అక్షిత బ్యూరో:** యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో కుంభం ఫౌండేషన్, మిలియన్ 1బిలియన్ సంయుక్త ఆధ్వర్యంలో భువనగిరి పట్టణంలోని న్యూ డైమెన్షన్ స్కూల్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళా విజయవంతంగా కొనసాగుతోంది. గత రెండు రోజులుగా నిర్వహించిన స్క్రీనింగ్ పరీక్షలు, టోకెన్ల కేటాయింపు



కార్యక్రమం విజయవంతంగా పూర్తికాగా, ఈ రోజు ఇంటర్వ్యూ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఈ ఇంటర్వ్యూ కార్యక్రమాన్ని భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి , ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య హాజరయ్యారు. గత రెండు రోజులుగా అభ్యర్థులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి టోకెన్ల కేటాయింపు ప్రక్రియను క్రమబద్ధంగా పూర్తి చేసినట్లు తెలిపారు. ఆదివారం రోజున వివిధ ప్రముఖ కంపెనీల ప్రతినిధులు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించగా, అర్హత సాధించిన వారికి నియామక పత్రాలు అందజేస్తున్నట్లు వెల్లడించారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ యువత ధైర్యంగా ఇంటర్వ్యూలను ఎదుర్కోవాలని సూచించారు. ఉద్యోగం చిన్నదైనా సరే అనుభవాన్ని సంపాదించడం ఎంతో ముఖ్యమని, ప్రతి యువకుడు తన నైపుణ్యాలను నిరంతరం పెంపొందించుకోవాలని తెలిపారు. నైపుణ్యం, అనుభవమే భవిష్యత్తులో మరింత ఉన్నత అవకాశాలకు దారి తీస్తాయని పేర్కొన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కుంభం ఫౌండేషన్ కీలక పాత్ర పోషిస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. జాబ్ మేళా నిర్వహణలో విశేషంగా కృషి చేసిన కుంభం ఫౌండేషన్ ఛైర్పర్సన్ కుంభం కీర్తి రెడ్డిని, వాలంటీర్లను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. యువత కోసం కుంభం ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు.

భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కుంభం ఫౌండేషన్ నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళా అభినందనీయమని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల యువతకు స్థానికంగానే ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి రావడం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు. యువతలో నైపుణ్యాభివృద్ధి పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని, ఈ జాబ్ మేళా అనేక కుటుంబాలకు ఉపాధి భరోసా కల్పిస్తోందని కొనియాడారు. అలాగే భువనగిరిలో యువతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఉద్యోగావకాశాలకు అవసరమైన శిక్షణ అందించే విధంగా స్కిల్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఐ బి ఎం ప్రతినిధులను ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కోరగా వారు సానుకూలంగా స్పందిచడం జరిగింది. స్థానిక యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను మరింత విస్తరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐబీఎం అసోసియేట్ డైరెక్టర్ ప్రసన్న నోరి, డైరెక్టర్ అభిరామ్, దీపిక వెంకటేష్ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, యువజన నాయకులు, మహిళా నాయకులు, అధికారులు, వాలంటీర్లు, ఉద్యోగార్థులు భారీ సంఖ్యలో యువత పాల్గొన్నారు.





# పీవీ రావ్ ఆశయ సాధనకు కృషి చేయాలి

### ఆలూర్ మండల కేంద్రంలో ఘనంగా పీవీ రావ్ 77వ జయంతి వేడుకలు

**ఆర్మూర్, అక్షిత ప్రతినిధి:** ఆలూర్ మండల కేంద్రంలో మాల మహానాడు మండల అధ్యక్షులు అగ్గు క్రాంతి ఆధ్వర్యంలో మాల మహానాడు వ్యవస్థాపకులు స్వర్గీయ పీవీ రావ్ (పోతుల విఘ్నేశ్వర రావు) 77వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీ రావ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ అంశంపై పీవీ రావ్ జీవితాంతం పోరాటం చేశారని, మాలల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం ఉద్యమించారని తెలిపారు. అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేసిన ఎస్సీ ఉపవర్గీకరణ విధానాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారని పేర్కొన్నారు. మాల మహానాడు సంస్థను స్థాపించి మాలల ఐక్యత, హక్కుల సాధన కోసం కృషి చేశారని కొనియాడారు. పీవీ రావ్ ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లాలని, సామాజిక న్యాయం కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాల మహానాడు జాయింట్ సెక్రటరీ పెండ ఉదయ్, హర్ష హరీష్, బంజ జాన్, తలారి సాజిన్ తదితరులు పాల్గొన్నారు.





# పటాన్‌చెరులో ప్రభుత్వ నాయబ్ ఖ్వాజీ కార్యాలయం ప్రారంభం

**-పటాన్‌చెరు రామచంద్రపురం అమీన్‌పూర్ జిన్నారం మండలాలకు ప్రభుత్వ నాయబ్ ఖ్వాజీగా హాఫిజ్ మొహమ్మద్ ఇబ్రహీం నియామకం**

**-ఖ్వాజీ ఆఫీసులు మైనారిటీ సంక్షేమ శాఖ పరిధిలో ప్రాంతీయ వక్ఫ్ బోర్డుల ఆమోదంతో పనిచేస్తాయి**

**-ముస్లిం వివాహాల రిజిస్ట్రేషన్ చట్టపరంగా నాయబ్ ఖ్వాజీ హాఫిజ్ మొహమ్మద్ ఇబ్రహీం ద్వారా చేయించుకోవాలి**

**అధ్యక్ష ఖ్వాజీ హాజీ సయ్యద్ లతీఫ్ అలీ ఖాద్రి అధికార ప్రకటన**

**పటాన్‌చెరు, అక్షిత ప్రతినిధి:**

పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని శాంతి నగర్ కాలనీలో తెలంగాణ ప్రభుత్వ నాయబ్ ఖ్వాజీ కార్యాలయం అధ్యక్ష ఖ్వాజీ హాజీ సయ్యద్ లతీఫ్ అలీ ఖాద్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పటాన్‌చెరు నియోజక వర్గానికి సంబంధించిన నాలుగు మండలాల ముస్లిం వివాహాల రిజిస్ట్రేషన్ నాయబ్ ఖ్వాజీ హాఫిజ్ మొహమ్మద్ ఇబ్రహీంను సంప్రదించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేసుకోవాలని తెలిపారు. ముస్లిం వివాహం నిఖా జరిగిన తర్వాత, ఆ వివాహాన్ని రిజిస్టర్ చేయడం చట్టపరంగా ముఖ్యమని తెలిపారు.దీనికోసం ఖాజీ కార్యాలయంలో నిఖా నామా నమోదు చేస్తారని తెలిపారు. వధూవరులు ఆధార్ కార్డు, పాన్ కార్డు, పాస్ పోర్టు సైజ్ ఫోటోలు,ఆహ్వాన పత్రికను సమర్పించి తమ వివాహాన్ని రిజిస్టర్ చేయించుకోవాలని తెలిపారు.ఖ్వాజీ జారీ చేసిన నిఖా నామా భారత చట్టం ప్రకారం చెల్లుబాటు అయ్యే సాక్ష్యంగా పరిగణించబడుతుందని తెలిపారు. క్వాజీ కార్యాలయాలు మైనారిటీ సంక్షేమ శాఖ పరిధిలో, ప్రాంతీయ వక్ఫ్ బోర్డు ఆమోదంతో పనిచేస్తాయని, వివాహాలు ధార్మిక కార్యకలాపాల కోసం ఇది ఏర్పాటు చేయబడతాయని, ఖ్వాజీ కార్యాలయ అధికారిక గుర్తింపు కోసం తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డు వెబ్ సైట్ ను సంప్రదించడం మంచిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు సయ్యద్ జహీర్, ఇమామ్ సహాబ్ జామ మస్జిద్ బిహెచ్ఇఎల్ మొహమ్మద్ అబ్దుల్ సత్తార్, డాక్టర్ ఫహీం, ఇస్మాయిల్, జావిద్ హుస్సేన్, ముజీబుర్ రహ్మాన్, సలీం ఖాన్, ముస్తఫా, అన్సార్, సమీర్, యూసుఫ్, వాజిద్, తదితరులు పాల్గొన్నారు.

## బాసర ఆలయ సూపరింటెండెంట్‌గా

# కే.సంజీవరావు బాధ్యతల స్వీకరణ

**ఏఈఓ ఈ. శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన అధికారి - వేద పండితుల ఆశీర్వాదం**

**నిర్మల్ అక్షిత బ్యూరో:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా కే సంజీవరావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యాలయంలో నూతన బాధ్యతలు చేపట్టిన సంజీవరావు ఆలయ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఏఈఓ) శ్రీనివాస్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఆలయ వేద పండితుడు నవీన్ శర్మ నూతన సూపరింటెండెంట్ కే సంజీవరావును ఆశీర్వదించి, ఆయన విధుల్లో విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ఆలయ సీనియర్ అసిస్టెంట్ శైలేష్ రాజేశ్వర్ పాల్గొని నూతన అధికారికి శుభాకాంక్షలు తెలిపారు. ఆలయ పరిపాలనలో సమర్థవంతంగా సేవలందిస్తూ భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని కే సంజీవరావు తెలిపారు.



# ప్రభుత్వము వెంటనే వరి ధాన్యం కొనుగోలు చేయాలి

**సిపిఎం మండల కార్యదర్శి బొబ్బిలి నిక్సన్ డిమాండ్**

**వనపర్తి అక్షిత ప్రతినిధి:**

కొత్తకోటలో రైతులు పండించిన వరి ధాన్యం కొనుగోలు చేయక పోవడంతో రైతాంగం మొత్తం ఆందోళన గురవుతున్నారని వెంటనే ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు వేగవంతం చేసి రైతులను ఆదు కోవాలని సిపిఎం మండల కార్యదర్శి బొబ్బిలి నిక్సన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సిపిఎం పార్టీ మండల పరిధిలోని అమడబాకుల కొత్తకోట కేంద్రాల్లో వరి ధాన్యం రోడ్లపై ఆరబెట్టిన రైతుల దగ్గరకు వెళ్లి పరిశీలన చేయడం జరిగింది. రైతులు నెల తరబడి వరి ధాన్యము రోడ్లపై ఆరబెట్టిన ప్రభుత్వానికి అధికారులకు రైతులపై కనికరం లేకుండా పోయిందని ఆయన విమర్శించారు. దాదాపుగా ప్రతి రైతు 25 రోజుల పాటుగా దాన్యమును రోడ్లపై ఆరబెట్టడం జరుగుతుందని ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో ప్రభుత్వం నిర్లక్ష్యం మే కారణమని ఆరోపించారు. రైతులు తాము పండించిన పంటకు అధికారులు ప్రభుత్వం పట్టించకపోవడం ద్వారా ఎండలు తీవ్రంగా ఉండడం రైతులు తమ పంటను ఎప్పుడు కొనుగోలు చేస్తారా అని ఆశతో ఎదురుచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షం వస్తే మా పరిస్థితి ఏమిటి? అంటూ బిక్కుబిక్కుమంటూ రైతులు ఆందోళనకు చెందుతున్నారని చెప్పారు.



గన్ని బ్యాగులు కొరత ఉందని తేమ పేరుతో తాలు పేరుతో రకరకాలుగా కాంగ్రెస్ ప్రభుత్వము రైతులను ఇబ్బందుల గురిచేస్తుందని ఆరోపించారు. పండించిన పంట కొనుగోలు దగ్గర రెండు కిలోల నుండి నాలుగు కిలోల వరకు వడ్లను తీయడం ప్రభుత్వం మానుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కావలి వెంకటయ్య, గొల్ల రాములు, రాములు, చెన్నయ్య, శివారెడ్డి, వెంకటన్న తదితరులు పాల్గొన్నారు.

# ముందస్తుగా సిపిఎం నాయకులు అరెస్ట్

**వనపర్తి, అక్షిత ప్రతినిధి:**

కొత్తకోట కమ్యూనిస్టులను అరెస్టు చేయడం న్యాయం కాదని భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రజల హామీలు అమలు చేయండి తెలంగాణకు న్యాయం చేయండి అని కొత్తకోట మండలం సిపిఎం కార్యదర్శి బొబ్బిలి నిక్సన్ విజ్ఞప్తి చేశారు హైదరాబాదులో జరుగుతున్న బహిరంగ సభకు రానున్న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సభకు అడ్డు తగులుతారని కొత్తకోటలో సిపిఎం పార్టీ నాయకులను




ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా కొత్తకోట మండలం సిపిఎం కార్యదర్శి బొబ్బిలి నిక్సన్ మాట్లాడుతూ కొత్తకోట కమ్యూనిస్టులను అరెస్టు చేయడం న్యాయం కాదని భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రజల హామీలు అమలు చేయండి తెలంగాణకు న్యాయం చేయండి అని విజ్ఞప్తి చేశారు. రైతు కార్మిక వ్యతిరేక విధానాలను పక్కకు పెట్టాలని విద్యుత్ సవరణ బిల్లుతో ఉచిత విద్యుత్తుకు ఎసరు పెట్టవద్దని కార్మిక హక్కులను కాలరాసే లేబర్ కోడ్స్ ను తెచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై స్పష్టత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధి హామీ నిర్లక్ష్యం చేయకుండా విబిజి రామ్ జి పేరుతో కొత్త చట్టం తెచ్చే కేంద్రం తన వాటను 90శాతం నుండి 60శాతానికి తగ్గించి ఆరు లక్షల మంది కూలీల బతుకులు దెబ్బతీయ వద్దని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణకు ఇచ్చిన విభజన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాములు, గొల్ల రాములు, వెంకటన్న తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో శాంతిభద్రతలు పూర్తిగా విఫలం : కవిత మాలోత్

**మహబూబాబాద్, అక్షిత బ్యూరో:**

మహబూబాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యులు కవిత మాలోత్ తన క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ అంగోత్ బిందు పాల్గొన్నారు. కవిత మాలోత్ మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతిభద్రతలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. హత్యలు, అత్యాచారాలు, దోపిడీలు పెరిగిపోయి తెలంగాణ పరిస్థితి మరో బీహార్‌లా మారిందన్నారు.



కరీంనగర్ బంగారు దుకాణం ఘటన, హైదరాబాద్‌లో ఐపీఎస్ అధికారి భార్య హత్య వంటి సంఘటనలు రాష్ట్ర పరిస్థితిని ప్రతిబింబిస్తున్నాయని తెలిపారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసును ప్రస్తావిస్తూ, వెంటనే అరెస్ట్ చేసి బండి సంజయ్‌ను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.





## మోడి బహిరంగ సభకు తరలిన నేలకొండపల్లి బిజెపి శ్రేణులు

**ఖమ్మం/అక్షిత బ్యూరో:**
నేలకొండపల్లి బీజేపీ పార్టీ మండల అధ్యక్షులు పాగర్తి సుధాకర్ ఆధ్వర్యంలో మండలం నుంచి పార్టీ నాయకులు కార్యకర్తలు సానుభూతి పరులు పెద్ద ఎత్తున సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ లో నరేంద్ర మోడి బహిరంగ సభకు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మల్లెబోయిన గోవిందరావు కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చావా కిరణ్ పాలేరు ఇంచార్జ్ నున్నా రవికుమార్ జిల్లా నాయకులు మన్నే కృష్ణారావు సీనియర్ నాయకులు కోటి హను మంతరావు నాయకులు సూరెపల్లి జ్ఞానరత్నం సయ్యద్ మోహినూద్దీన్ కందరబోయిన వెంకటరమణ గుండెపొంగు క్రాంతి కందరబోయిన గోపి కొండా హర్ష వర్ధన్ పుట్టా సత్యనారాయణ బ్రహ్మవరపు నాగరాజు లింగనబోయిన వెంకటేశ్వర్లు మూడు రమేష్ జోగుపర్తి నారాయణరావు పల్లపు ఉమ బానోత్ శ్రీనివాస రావు కూరపాటి రామాచారి మీగడ గోపి జెల్లా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఆరోగ్యంపై ప్రజా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

### - ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి

**నడిగూడెం, అక్షిత న్యూస్:** కోదాడ క్యాంపు కార్యాలయం నందు ఆదివారం నడిగూడెం మండలంకు చెందిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేసారు. ఈ కార్యక్రమంలో కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఏపూరి తిరుపతమ్మ సుధీర్, మండల పార్టీ అధ్యక్షుడు,రామాపురం సర్పంచ్ బూత్కూరు వెంకటరెడ్డి, నడిగూడెం, రత్నవరం, బృందావనపురం,ఈకే పేట తండా సర్పంచులు దున్నా శ్రీనివాస్,దాట్ల నాగేశ్వరరావు, కంభంపాటి సరిత చైతన్య,ధారావత్ వరలక్ష్మి వెంకటరమణ, కేశగాని సరిత లక్ష్మణ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పల్లపు శ్రీనివాస్, కార్యదర్శి గుర్రం నీలిమా గాంధీ మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గుండు శ్రీనివాస్,మండల



కాంగ్రెస్ పార్టీ నాయకులు పగడాల ప్రభాకర్ రెడ్డి,గడ్డం మల్లేష్ యాదవ్, మొక్క బిక్షపతి,శెట్టి సతీష్,దేవబత్తిని రమేష్ ప్రసాద్, కాసాని శివలింగం,రేపాల పురుషోత్తం,పోలంపల్లి వీరయ్య,భారీ వెంకన్న, శివ, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఎరువుల వ్యాపారుల సంఘం ఎన్నికలు ఏకగ్రీవం

**ఆసిఫాబాద్, అక్షిత ప్రతినిధి:**
కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎరువుల వ్యాపారుల సంఘం ఎన్నికల్లో కార్యవర్గంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని స్థానిక వాసవీ భవనంలో సంఘ సభ్యుల సమక్షంలో జరిగిన సమావేశంలో నూతన అధ్యక్షుడిగా కాచం నాందేవ్, గౌరవ అధ్యక్షుడిగా తాటిపల్లి వినోద్, ఉపాధ్యక్షులుగా ఎస్ రాజన్న, అవనిదర్ గౌడ్, ప్రధాన కార్యదర్శులుగా ప్రకాష్, విశాల్, ఖలీద్ బిన్ యాఫై సంయుక్త కార్యదర్శులుగా లక్ష్మణ్, సంతోష్, మహేష్ కోశాధికారికారులుగా టి ఆశిష్, టి గిరీష్ కార్యవర్గ సభ్యులుగా రామకృష్ణ, శివకుమార్, బి తిరుపతి, సాగర్, ఏ తిరుపతి స్పోక్స్ పర్సన్ గా తిరుపతిలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన కార్యవర్గంకు సభ్యులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లా డుతూ నూతన అధ్యక్షుడుగా జిల్లా వ్యాప్తంగా ఎరువుల వ్యాపారుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. రైతులకు నాణ్యమైన ఎరువులు అందేలా చర్యలు తీసుకుంటామని, వ్యాపారుల హక్కుల పరిరక్షణకు సంఘం ఎల్లప్పుడూ ముందుంటానని పేర్కొన్నారు. అనంతరం సంఘం నాయకులు నూతన అధ్యక్షుడితో పాటు కార్యవర్గం సభ్యులను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు, వ్యాపారులు పాల్గొన్నారు.

# మిర్యాలగూడ బైపాస్ రోడ్డు జంక్షన్ల వద్ద స్పీడ్ బ్రేకర్లు, జీబ్రా లైన్స్ ఏర్పాటు చేయాలి

### యుద్ధ ప్రాతిపదికన ఫ్లైఓవర్ల నిర్మాణం చేపట్టాలి

### సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మల్లేష్

**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి:**
మిర్యాలగూడ పట్టణం బైపాస్ రోడ్డుపై రాంచంద్రగూడ, నందిపాడు, చిల్లాపురం, చింతపల్లి ఈదులగూడ జంక్షన్ వద్ద క్రాసింగ్ లో ఉన్న స్పీడ్ బ్రేకర్లు, జీబ్రా లైన్స్ మార్కింగ్ లేకపోవడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని సీపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డి. మల్లేష్ ఆరోపించారు. ఆదివారం బై పాస్ రోడ్డు నందిపాడు చౌరస్తా వద్ద స్పీడ్ బ్రేకర్ ను సిపిఎం బృందం పరిశీలనలో అక్కడ స్పీడ్ బ్రేకర్ ఉన్నాయని విషయమే మరిచిపోయి, అవి రోడ్లలోనే కలిసిపోయి ఉండడం, వాహనాలు వేగంగా పోవడం వలన ప్రమాదాలు జరిగి అనేక మంది ఇప్పటికే ప్రాణాలు కోల్పోయారని మల్లేష్ తెలిపారు. నిరంతరం రద్దీగా ఉండే ఆ ప్రాంతంలో ఎటువంటి హెచ్చరికలను సూచించే బోర్డులు లేకపోవడం వలన ప్రమాదాలు మరింత పెరుగుతున్నాయని దీనిపై అధికారులు, ప్రజా ప్రతినిధులు చోద్యం చూస్తున్నారే తప్ప పరిష్కార మార్గం చూపట్లేదని ఆయన అన్నారు. బైపాస్ జంక్షన్ల వద్ద వైన్స్ షాపులకు అనుమతి ఇవ్వడం కూడా ప్రమాదాలకు మరొక కారణమని వారు చెప్పారు. తక్షణమే అటువంటి వైన్స్ లను రద్దుచేసి వేరే చోట తరలించాలని వారు అధికారులను కోరారు. అంతేకాకుండా బైపాస్ రోడ్డు మీద ఫ్లైఓవర్ నిర్మాణం చేపడతామని శంకుస్థాపన జరిగి సంవత్సరాలు దాటుతున్న అవి ఒట్టి మాటలుగా, నీటి మీద రాతలుగా మిగిలి పోయాయని అధికారులు కానీ ప్రజాప్రతినిధులు కానీ వాటిపైన దృష్టి లేకపోవడం వలన నిరంతరం ప్రమాదాలు జరుగుతున్నా యన్నారు. ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అనేక మందికి యాక్సిడెంట్లు గురై కాళ్లు చేతులు





పోగొట్టుకొని ఇప్పటికి వికలాంగులుగా మారి జీవితం నరకంగా మారి ఇబ్బంది పడుతున్న సమస్య పట్ల అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్టు ఉన్నదని తక్షణమే చర్యలు తీసుకోకపోతే సిపిఎం ఆధ్వర్యంలో అఖిలపక్ష బృందాలను కలుపుకొని భవిష్యత్తులో ఆందోళనలు చేపడతామని, సమస్య పరిష్కారం అయ్యేంతవరకు ప్రజల పక్షాన నిలబడి పోట్లాడుతామన్నారు.

కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.రవినాయక్, రాగిరెడ్డి మంగారెడ్డి, సిపిఎం టూ టౌన్ కార్యదర్శి భావండ్లపాడు, నాయకులు గోవిందరెడ్డి, రామారావు, రవి పాల్గొన్నారు.




# ఖమ్మం లకారం ట్యాంక్‌బండ్ వద్ద ఎమర్జెన్సీ మెడిసిన్ అవుట్‌రీచ్ సిపిఆర్

**ఖమ్మం/అక్షిత బ్యూరో:**
ఖమ్మం మమత మెడికల్ కాలేజ్ అండ్ జనరల్ హాస్పిటల్ ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో స్ట్రెంగథెనింగ్ ప్రెహాస్పిటల్ కేర్ అండ్ కంప్రెషన్ ఓన్లీ లైఫ్ సపోర్ట్ అనే అంశంపై లకారం ట్యాంక్‌బండ్ వద్ద ఆదివారం కమ్యూనిటీ అవుట్‌రీచ్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది.



ఈ కార్యక్రమం ద్వారా సాధారణ ప్రజలు సైక్లిస్టులు అథ్లెట్లు మరియు వాకర్లకు అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను రక్షించే సిపిఆర్ (కార్డియే పుల్మనరీ రెసుసైటేషన్ ) పై అవగాహన కల్పించారు. ఎమర్జెన్సీ మెడిసిన్ బృందం ప్రత్యక్ష ప్రదర్శనల ద్వారా కంప్రెషన్ ఓన్లీ సిపిఆర్ విధానాన్ని ప్రజలకు వివరించింది. ఈ కార్యక్రమంలో 150 మందికి పైగా పాల్గొని సిపిఆర్ నేర్చుకున్నారు.
ఈ కార్యక్రమానికి మమత మెడికల్ కాలేజ్ డైరెక్టర్ పువ్వాడ నరేన్ ప్రిన్సిపల్ డా. అనురాధ మెడికల్ సూపరింటెండెంట్ డా. బి. రామస్వామి ఆర్ఎంవో డా. కె. సంతోష్ రెడ్డి ప్రోత్సాహం అందించగా ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాధిపతి డా.కె.మహేంద్ర కుమార్ మార్గదర్శకత్వంలో కార్యక్రమం నిర్వహించారు.డా. తమ్మినేని శృతి ఎం.డి. (ఎమర్జెన్సీ మెడిసిన్) సీనియర్ రెసిడెంట్ అలాగే విభాగానికి చెందిన అధ్యాపకులు రెసిడెంట్లు ఇంటర్నల్ వాలంటీర్లు కార్యక్రమంలో చురుకుగా పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు.
ఈ అవుట్‌రీచ్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించగా ప్రీహాస్పిటల్ కేర్ అత్యవసర పరిస్థితుల్లో సమాజ భాగస్వామ్య ప్రాధాన్యతను ఈ కార్యక్రమం స్పష్టంగా తెలియజేసింది.




# కాకతీయ మెగా ఇంటిగ్రేటెడ్ టెక్స్ టైల్ రీజియన్, అప్పారల్ (పీఎం మిత్ర)పార్క్ ప్రారంభం

**వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ**

**వరంగల్, అక్షిత బ్యూరో:** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదివారం హైదరాబాద్ నుంచి వర్చువల్ విధానంలో ప్రధాన మంత్రి మెగా ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ రీజియన్ అండ్ అప్పారెల్ (పీఎం మిత్ర) పార్క్‌లో భాగమైన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను ప్రారంభించారు. ఈ వర్చువల్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ పరిధిలో ఏర్పాటు చేసిన ఎల్ఈడి స్క్రీన్ ద్వారా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.సంధ్య రాణి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వై వి గణేష్, జడ్పీ సీఈవో రామ్ రెడ్డి లు,జోనల్ మేనేజర్ స్వామి, సంగెం తహసీల్దార్ రాజ్ కుమార్ ఈ సన్నివేశంలో పాల్గొని తిలకించారు.

# పార్టీ బలోపతానికి కృషి చేయాలి

**- ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి.**

**నడిగూడెం, అక్షిత న్యూస్:**
ఇటీవల జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన నడిగూడెం గ్రామానికి చెందిన పల్లపు శ్రీనివాస్,జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన కరివిరాల గ్రామానికి చెందిన గుర్రం నీలీమా గాంధీలు ఆదివారం కోదాడ ఎమ్మెల్యే నలమాద ఉత్తమ్ పద్మావతి రెడ్డిని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి తమను జిల్లా కమిటీలో తీసుకున్నందుకు ఎమ్మెల్యేకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అనంతరం శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఏపూరి తిరుపతమ్మ సుధీర్,మండల పార్టీ అధ్యక్షుడు,రామాపురం సర్పంచ్ బూత్కూరు వెంకటరెడ్డి, నడిగూడెం,

రత్నవరం,బృందావనపురం,ఈకే పేట తండా, వల్లాపురం గ్రామాల సర్పంచులు దున్నా శ్రీనివాస్,దాట్ల నాగేశ్వరరావు, కంభంపాటి సరిత చైతన్య,ధారావత్ వరలక్ష్మి వెంకటరమణ, కేశగాని సరిత లక్ష్మణ్, మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గుండు



శ్రీనివాస్,మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పగడాల ప్రభాకర్ రెడ్డి,గడ్డం మల్లేష్ యాదవ్, మొక్క బిక్షపతి,శెట్టి సతీష్,దేవబత్తిని సురేష్ ప్రసాద్,రేపాల పురుషోత్తం,పోలంపల్లి వీరయ్య,భారీ వెంకన్న,శివ,సైదా నాయక్ తదితరులు తదితరులు పాల్గొన్నారు..

## కల్వల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని

# సందర్శించిన సిపిఎం బృందం

**కేసముద్రం, అక్షిత బ్యూరో:**
కేసముద్రం మండలం కల్వల గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సిపిఎం పార్టీ మండల కమిటీ బృందం ఆదివారం సందర్శించింది. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ పది రోజుల క్రితం ప్రారంభమైన కొనుగోలు కేంద్రంలో తేమ శాతం అధికంగా ఉండటంతో ఈ నెల 8వ తేదీ నుంచి ధాన్యం బస్తాలు నింపి కంటాలు ప్రారంభించారని తెలిపారు. నిన్న సాయంత్రం కురిసిన అకాల వర్షంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. ఇప్పటికే నింపిన బస్తాలను వెంటనే కంటాలు వేసి మిల్లులకు తరలించాలని, తేమ పేరుతో ఎలాంటి తరుగు విధించవద్దని డిమాండ్ చేశారు. కంటాలు పూర్తయిన వారం రోజుల్లోపు రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని, మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్‌ను త్వరితగతిన చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గోడిశాల వెంకన్న, మండల కమిటీ సభ్యులు మోడెం వెంకటేశ్వర్లు, జల్లే జయరాజ్, నీరుటి జలందర్, సుంకరి వెంకన్నతో పాటు రైతులు



పెద్దరపు అశోక్, ధరవత్ రవి, ఎడెల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎం. వెంకట్ రెడ్డి, సపవట్ సజ్జన్, ధరవత్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



# జేఎంఎం ఎంపీ మహువ మజికి ఎంపీ వద్దిరాజు చీర బహుకరణ

**హైదరాబాద్, అక్షిత ప్రతినిధి:**
బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తన సహచర ఎంపీ మహువ మజికి చీర



బహుకరించారు. జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం)కు చెందిన రాజ్యసభ సభ్యురాలు మహువ మజి తన కుమారుడు సోంవిట్ మజితో కలిసి హైదరాబాద్ పర్యటనకు వచ్చారు.ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర శనివారం వారిని తన నివాసానికి ఆహ్వానించి ఆతిథ్యమిచ్చి చీర బహుకరించారు.కొద్దిసేపు వారు దేశంలో నెలకొన్న రాజకీయ పరిస్థితుల గురించి చర్చించారు.

# ఎంపీ వద్దిరాజు నూతన వధూవరులకు ఆశీస్సులు

**హైదరాబాద్, అక్షిత ప్రతినిధి:**
బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర నూతన వధూవరులు వైష్ణవి-రూప్ కోమల్ కు తన ఆశీస్సులు అందజేశారు. మామిండ్ల శ్రీనివాస్ -శైలజ దంపతుల కనిష్ఠ కుమార్తె వైష్ణవి పెళ్లి కోవిలపాటి మనోహర్ రావు-లక్ష్మీవనజ దంపతుల



కనిష్ఠ కుమారుడు రూప్ కోమల్‌తో ఆదివారం ఘనంగా జరిగింది. హైదరాబాద్ కొంపెల్లి సాయినగర్‌లోని చంద్రారెడ్డి గార్డెన్స్ ఫంక్షన్ హాలులో జరిగిన ఈ పెళ్లికి ఎంపీ రవిచంద్ర హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర వెంట మున్నూరుకాపు సంఘం ప్రముఖులు పర్వతం సతీష్ తదితరులు ఉన్నారు.



## జగిత్యాల జిల్లాలో పెద్ద హనుమాన్ జయంతి వేడుకలకు కొండగట్టు ముస్తాబు

**జగిత్యాల అక్షితబ్యూరో:**

కొండగట్టు ఆంజనేయ స్వామి వారి ఆలయంలో నేటి నుంచి 13 వరకు పెద్ద జయంతి ఉత్సవాలు..
ఏటా బహుళ పూర్వాభాద్ర నక్షత్రం రోజున జరుగుతున్న పెద్ద జయంతి వేడుకలు. వేద మంత్రోచ్చారణల మధ్య ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి.. ఉత్సవాలకు శుభారంభం చేశారు.



భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానం నుంచి శేష వస్త్రాలు, అక్షింతలు కొండగట్టుకు చేరుకోగా... ప్రభుత్వం తరపున చొప్పదండి శాసనసభ్యుడు మేడిపల్లి సత్యం స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు...దకళాబృందాల నృత్యాలు, మంగళవాయిద్యాల నడుమ ఎమ్మెల్యేకు ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు....

## ధాన్యం తూకాల్లో మోసాలను సహించం

**- ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి**

**కరీంనగర్ అక్షిత బ్యూరో:**

ధాన్యం తూకాల్లో మోసాలను సహించబోమని మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ స్పష్టం చేశారు. తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారని రైతుల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు ఆదివారం తిమ్మాపూర్ మండలం రేణికుంటలోని ఓ ప్రైవేట్ రైస్ మిల్లును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా వరి ధాన్యం కొనుగోళ్ల తీరుపై రైస్ మిల్లు యజమాని అడిగి తెలుసుకున్నారు. తూకాల్లో మోసాలకు పాల్పడు తున్నట్టుగా రైతుల నుంచి వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో ఇక నుంచి ఆ విధానానికి స్వస్తి పలకాలని ఆయన స్పష్టం చేశారు. అన్లోడింగ్ లో తీవ్రమైన జాప్యం జరగడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని,



ఈ దృష్ట్యా అన్ లోడింగ్ త్వరగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన మిల్లు యజమానిని , అధికారులను ఆదేశించారు.

ఎమ్మెల్యే వెంట తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేష్, ఉపాధ్యక్షుడు తమ్మనవేని రాములు యాదవ్, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఎలుక రాజు, నాయకులు బొంగోని వీరయ్య, ఎడ్ల సురేందర్ రెడ్డి, బుర్ర అంజయ్య, బొంగోని సురేష్, చెక్కబండ సత్యనారాయణ రెడ్డి తదితరులు ఉన్నారు.




## అల్ఫోర్స్ విద్యా సంస్థల్లో ఘనంగా నాలుగో రోజు సుందరకాండ ప్రవచన జ్ఞాన యజ్ఞం

**కరీంనగర్ అక్షిత బ్యూరో:**

శ్రీరాముని ఆరాధించడం వలన సకల శుభఫలాలు కలుగుతాయని

శ్రీరాముడు ధర్మానికి ప్రతీకని సత్యానికి నిర్వచనమని వాల్మీకి మహర్షి రచించిన సుందరకాండని పఠించిన గాని విన్నను గాని, మానసిక శారీరక శక్తి పెరుగుతుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వివిఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు “అల్ఫోర్స్” డా.వి. నరేందర్ రెడ్డి మరియు పరివారంతో కలిసి నాలుగవ రోజు సుందరకాండ ప్రవచన జ్ఞాన యజ్ఞం ప్రారంభోత్సవం సందర్భంగా వారు భక్తులను ఉద్దేశించి మాట్లాడారు

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు శ్రీరాముని ఆదర్శంగా తీసుకొని వారి యొక్క గుణాలను అలవర్చుకొని విజేతలుగా నిలవాలని వారు కోరారు. వారు సీతను కనుగొన్న విధానం చాలా శాంతియుతంగా జరిగిందని ఆ విధానాన్ని ప్రతి ఒక్కరూ అవలంభించినట్లయితే సమాజంలో ఎటువంటి భేద భావాలు ఉండవని చెప్పారు

బ్రహ్మశ్రీ డాక్టర్ గర్రపెల్లి మహేశ్వర శర్మ మార్గదర్శకమున నిర్వహిస్తున్నటువంటి ఈ ప్రవచనాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని రోజు వారీ కార్యకలాపాలలో అవలంబించి విజయాలను సాధించాలని వారు సూచించారు. కార్యక్రమంలో భాగంగా చేసినటువంటి పలు భజనలు స్ఫూర్తి నింపాయి

### వీహెచ్ ఆమరణ నిరాహారదీక్ష దీక్షకు తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం

## ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షులు పోగుల సైదులు మద్దతు

**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి:**

కేంద్రం జనాభా గణనలో భాగంగా ఓబిసి కులగణన చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు, మాజీ ఎంపి, పిసిసి మాజీ అధ్యక్షుడు వి.హనుమంతరావు ఆమరణ నిరాహారదీక్షకు తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు పోగుల సైదులు గౌడ్ దీక్ష శిబిరాన్ని ఆదివారం సందర్శించి మద్దతు తెలిపారు. దేశ వ్యాప్తంగా జరిగే జనాభా లెక్కల్లో కులగణన చేస్తామని బీజేపీ కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చి ఎస్సీ, ఎస్టీ, కాలమ్ పెట్టి, ఓబీసీ కాలమ్ పెట్టకపోవడాన్ని బీజేపీ కేంద్ర ప్రభుత్వం ఓబీసీలపట్ల వ్యవరించే తీరుకు నిరసనగా ఆమరణ నిరాహారదీక్షకు మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఒక బీసీ వ్యక్తి నరేంద్రమోదీ ప్రధానమంత్రి అయిన తరువాత దేశంలో బీసీ పరిస్థితి అద్వాన్నంగా తయారయిందన్నారు,




నరేంద్ర మోదీ ప్రభుత్వం బీసీల వ్యతిరేకంగా ప్రవర్తిస్తుందని విమర్శించారు, తమిళనాడు తరహాలో బీసీలు తెలుగు రాష్ట్రాలలో రాజకీయాలు చెయ్యాలని రాజ్యాధికారంలోకి రావాలని పిలుపు నిచ్చారు. వీహెచ్ దీక్షకు మద్దతు తెలుపుతూ బీజేపీ ప్రభుత్వ బీసీ వ్యతిరేక విధానాలను తూర్పురా బట్టారు. స్వాతంత్ర్య భారత దేశంలో 79 సంవత్సరాలు బీసీలు అన్యాయానికి గురైయ్యారని వాపోయ్యారు, దేశవ్యాప్తంగా జనాభా లెక్కల్లో కులగణన చేస్తామని హామీ ఇచ్చి మాట తప్పడం దారుణమని దుయ్యబట్టారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సరికొండ రామకృష్ణం రాజు, రాష్ట్ర కార్యదర్శి కర్ణాటక శివరామకృష్ణ, కల్లా నరసింహగౌడ్, జిల్లా కుశలవ, కొత్త లింగస్వామి యాదవ్, సతీష్ కుమార్, తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



# తమిళనాడు సిఎంగా ప్రమాణ స్వీకారం చేసిన జోసఫ్ విజయ్ దళపతికి శుభాకాంక్షలు

**-తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్**

ఖమ్మం/అక్షిత బ్యూరో:

టీవీకే పార్టీ అధినేత విజయ్ దళపతి 108 సీట్లలో ఘన విజయం సాదించి చరిత్రను తిరగ రాసిన మహా నాయకుడు మూడు రోజుల నాటకీయ పరిణామాల మధ్య 120 మంది ఎమ్మెల్యేల చేత బల నిరూపణ చేసుకొని తమిళనాట నూతన ముఖ్యమంత్రిగా గవర్నర్ చేత ప్రమాణ స్వీకారం చేసి తమిళనాడు ప్రజల మధ్య ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న జోసెఫ్ విజయ్ దళపతి కు తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర కమిటీ తరపున హార్దిక శుభాకాంక్షలు తెలియజేసిన డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ దళితరత్న

బడుగు బలహీన వర్గాల కోసం నిరంతరం శ్రమిస్తూ చిన్న వయసులో పేద ప్రజలకు సేవలు అందించి జ్యోతిరావు పూలే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పెరియర్ రామస్వామి నాయకర్ ఆలోచనతో ఎన్నో కొత్త పథకాలు సంస్కరణలు తీసుకొచ్చి చిన్న వయసులో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి బడుగు బలహీన వర్గాల పేదకు సేవ చేయడానికి వచ్చిన ముఖ్యమంత్రి దళపతి విజయ్ బహుజన వర్గాల కోసం సేవలు చేయాలని అభినందనలు తెలియజేసిన డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ అనంతరం తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ దళపతి చిత్రపటానికి పాలాభిషేకం చేసిన బహుజన నాయకులు.

పాలాభిషేకం కార్యక్రమం తెలంగాణ మాదిగ హక్కుల దండోరా ఖమ్మం నగర కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కుక్కల రామకృష్ణ ఆర్కే పగిడి ముక్కల విజయ్ కుమార్ ఏర్పాటు చేసిన పాలాభిషేకంలో పాల్గొన్న నాయకులు గుంతటి వీరభద్రం ఖమ్మం గర్జన దాసరి శ్రీనివాస్ మాల మహానాడు అధ్యక్షులు లంబాడి హక్కుల పోరాట సమితి అధ్యక్షులు బానోత్ బద్రి నాయక్ టీఎంహెచ్డీ రఘునాథపాలెం మండల అధ్యక్షులు కాంపాటీ ఉపేందర్ పి హెచ్ పి ఎస్ నాయకులు ఆన్తోటి సురేష్ బహుజన నాయకులు రాఘవులు వీర నారీమణుల మహిళ మహిళా అధ్యక్షురాలు ఉపేంద్ర బాయ్ పాగా యోను సంగమేశ్వర రావు సంజీవులు వెంకన్న గోపాల్ విజయ తదితరులు పాల్గొన్నారు.

# స్టేట్ టాపర్ ని అభినందించిన త్రివేణి డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి

ఖమ్మం /అక్షిత బ్యూరో:

ఇటీవల ప్రకటించిన పదవ తరగతి ఫలితాలలో రాష్ట్రస్థాయిలో 595 మార్కులతో మూడవ స్థానం లో నిలచిన ఎల్ నేహా ను త్రివేణి విద్యాసంస్థల అధిపతి డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి అభినందించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా మా త్రివేణి విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని మా విద్యార్థులు చదువు లోనే కాక సమాజంలో ఎలా బతకాలో సమాజాన్ని ఎలా ప్రేమించాలి అని కూడా మా త్రివేణి నేర్పిస్తుందని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో 595 మార్కులు సాధించిన ఎల్ నేహా మాట్లాడుతూ నా విజయానికి మా పాఠశాల విద్యా ప్రణాళిక స్టడీ అవర్స్ స్లాట్ ఎగ్జామ్స్ ఉపాధ్యాయుల కృషి మరియు తల్లిదండ్రుల ప్రోత్సాహం మా పాఠశాలలో ఏర్పాటుచేసిన మోటివేషన్ క్లాసెస్ నా ఈ ర్యాంకు రావడానికి ఎంతగానో దోహదపడ్డాయి. ఇలాంటి పాఠశాలను స్థాపించి నాలాంటి ఎందరో విద్యార్థులను అత్యుత్తమంగా తీర్చిదిద్దుతున్న డైరెక్టర్ కి యాజమాన్యానికి మరియు త్రివేణి పాఠశాలలోని ఉపాధ్యాయ బృందానికి నేను ఎప్పటికీ రుణపడి ఉంటానని తెలియజేసింది. ఈ కార్యక్రమంలో సిఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ చీకటి అప్పారావు పాఠశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ వైస్ ప్రిన్సిపాల్ ముస్తఫా స్వప్న క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్ ట్రాన్స్పోర్ట్





ఇంచార్జ్ సందీప్ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థిని అభినందించారు.

# ఆర్.టి.ఐ మండల కమిటీ ఎన్నిక

నడిగూడెం, అక్షిత న్యూస్:

మండల కేంద్రంలో సమాచార హక్కు చట్టం నడిగూడెం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది ఎన్నికైన వారిలో మండల అధ్యక్షులుగా గంటేపంగు విజయ్ ఉపాధ్యక్షులుగా నేలమర్రి మధు వర్కింగ్ ప్రెసిడెంట్ గా నెమ్మాది కాంతారావు టౌన్ ప్రెసిడెంట్ గా గంటే పంగు నాగరాజు మరియు టౌన్ వైస్ ప్రెసిడెంట్గా దున్న సందీప్ సెక్రటరీగా మాతంగి సురేందర్, దాసరి శ్రీకాంత్ జాయింట్ సెక్రటరీగా శ్రీను జనరల్ సెక్రటరీగా మేకపోతుల లక్ష్మణ్, కన్నెబోయిన శ్రీను



పొలిటికల్ కన్వీనర్ గా దున్న దినేష్ కుమార్ యూత్ కన్వీనర్ గా దున్న శ్రీకాంత్ మరియు సమద్, శ్రీరామ్ మీడియా కన్వీనర్ గా గంటేపంగు సైదులు కోఆర్డినేటర్స్ గా దాసరి నాగేశ్వరరావు, లంజపల్లి రవి శిశు రక్షణ కన్వీనర్ గా దున్న నాగరాజు విద్యార్థి కన్వీనర్ గా నవీన్ ను ఎన్నుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం సూర్యాపేట జిల్లా ఉపాధ్యక్షులు నెమ్మాది రామారావు కోదాడ నియోజకవర్గం ఇన్చార్జి గడ్డం అంజి, మునగాల మండల అధ్యక్షుడు ఆకారపు వసంత్ తదితరులు పాల్గొన్నారు.

# 11 నుండి విద్యా వారోత్సవాలను విజయవంతం చేయండి

**- మండల విద్యాశాఖ అధికారి యన్.రాజేశ్వరరావు.**

సత్తుపల్లి, అక్షిత న్యూస్:

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యా వారోత్సవాలను విజయవంతం చేయాలని సత్తుపల్లి మండల విద్యాశాఖ అధికారి యన్. రాజేశ్వరరావు తెలిపారు. ఈనెల 11 నుండి 17వ తేదీ వరకు విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యా వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడిం



చారు. వారోత్సవాల్లో భాగంగా ఈనెల 11న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తుంబూరు నందు సమ్మర్ క్యాంపు ప్రారంభించడంతో మొదలుకొని 17 వరకు పాఠశాలల్లో పదవ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు రెమిడీయల్ క్లాసుల ప్రారంభించడం, బడిబాట కార్యక్రమాలు నిర్వహించడం, పుస్తక ప్రదర్శనలు చేయుట, సర్పంచ్‌లకు విద్యా కార్యక్రమాలపై వర్క్ షాప్ మొదలగు కార్యక్రమాలు నిర్వహించుట జరుగు తాయని తెలిపారు. అన్ని పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచి అందంగా తీర్చిదిద్దాలని కోరారు. ప్రజా ప్రతినిధులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విద్యా వారోత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. 99 రోజులప్రజాపాలనప్రగతిప్రణాళికలో భాగంగా రేపటి నుండి 25వ తేదీ వరకు పి.ఎం.ఎస్.హెచ్.ఆర్. ఐ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తుంబూరు నందు మండలంలోని అన్ని పాఠశాలల ఆరో తరగతి నుండి తొమ్మిదవ తరగతి చదివే విద్యార్థులకు ఉదయం ఎనిమిది గంటల నుండి 12 గంటల వరకు వేసవి శిబిరం ఏర్పాటు చేయనైనదని తెలిపారు.

శిబిరంలో యోగా, ధ్యానం,డ్రాయింగ్,ఇండోర్ గేమ్స్, కంప్యూటర్ విద్య, స్పోకెన్ ఇంగ్లీష్ లాంటి అంశాలను నేర్పడం జరుగుతుందని తెలిపారు. హాజరయ్యే విద్యార్థులకు స్నాక్స్ అందించుట జరుగుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఈ క్యాంపుకు పంపించిసద్వినియోగం చేసుకొని వారి పిల్లల మానసికవికాసానికి దోహదపడాలని తెలియజేశారు.